బోనాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయాల బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి బుధవారం విడుదల చేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ముఖ్య సలహాదారులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్, కోశాధికారి బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు అబిడ్స్ ఏసీపీ చేయూత

అబిడ్స్: ఆపదలో ఉన్న అంబులెన్స్ డ్రైవర్‌కు అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ అండగా నిలిచారు. ఎంజే మార్కెట్ కేర్ ఆసుపత్రి వద్ద అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసే మహ్మద్ మంజూర్ సిద్దిఖీ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ.. ఆర్థికస్తోమత లేక దీనావస్థలో ఉన్నాడు. ఇది గమనించిన అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ అతనికి రూ.10 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిఖీ మాట్లాడుతూ.. తాను కేర్ ఆసుపత్రికి రాగా డబ్బుల్లేక ఉన్నానని ఏసీపీ గమనించి ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారని పేర్కొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

యాకుత్‌పురా: నూతన రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించకుండా ఆన్‌లైన్ పత్రాలతో నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్–2 ఏసీఎస్‌ఓ మోకా సురేందర్ సూచించారు. పురానీహవేలీలోని సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో 42,318 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రాగా ఇప్పటివరకు 12,982 దరఖాస్తులను పరిశీలించి పలు కారణలతో 1200 దరఖాస్తులు తిరస్కరించామన్నారు.

ఈయేడు చార్మినార్ వద్ద ఊరేగింపు

సాక్షి సిటీబ్యూరో: నవాబ్ రౌనక్ యార్ ఖాన్ (ఆసఫ్ జాహీ వారసుడిగా గుర్తింపు పొందిన నిజాం వారసుడు), షియా కౌన్సిల్ కలిసి ఈ ఏడాది బీబీ కా ఆలం ఊరేగింపును చార్మినార్ వద్ద నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇది కుతుబ్ షాహీ వంశం నిర్మించిన స్థలం కాగా, నిజాంలు కూడా దీన్ని మతసామరస్యానికి కేంద్రంగా నిలిపారు. ముఖ్యంగా, మిర్ ఉస్మాన్ అలీ ఖాన్ బీబీ కా ఆలానికి అమూల్య రత్నాలు బహూకరించారు. నవాబ్ రౌనక్ యార్ ఖాన్ ఈ మార్పు ద్వారా తన రాజ కుటుంబాన్ని ప్రజాస్వామిక భారత సమాజంలో భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. షియా సివిల్ కౌన్సిల్ కూడా ఆధునిక విలువలకు అనుగుణంగా సంప్రదాయాల అన్వయానికి మద్దతు తెలిపింది.

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

నాంపల్లి: పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెట్రోలింగ్‌లో భాగంగా కానిస్టేబుల్ రవి విధులు ఉన్నారు. చార్‌కాందిల్ సమీపంలో వసీం అనే వ్యక్తి తన ఇంటి ముందున్న చెట్లను నరికి రోడ్డు మీద వేశారు. చెట్ల కొమ్మలు రోడ్డు మీద ఎందుకు వేశావని కానిస్టేబుల్ అడిగారు. దీంతో అతడు కానిస్టేబుల్‌పై దురుసుగా మాట్లాడుతూ వీరంగం సృష్టించారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు వసీంపై కేసు నమోదు చేశారు.

ఉపాధి కోర్సులతో భరోసా

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి
- విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న వారితో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి

మెహిదీపట్నం: విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి కోర్సులు నేర్చుకుంటే ఎంతో భరోసా ఉంటుందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మీ అన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్‌డీసీ, స్కిల్ ఇండియా సంయుక్తంగా గోల్కొండ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన షార్ట్ టర్మ్ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి బుధవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. షార్ట్‌టర్మ్ కోర్సులు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయన్నారు. సర్టిఫికెట్లు పొందిన వారు చదువు పూర్తయిన తర్వాత సొంతంగా బ్యూటీపార్లర్లు తదితర వ్యాపారాలు పెట్టుకుని ఉపాధి పొందవచ్చన్నారు. స్కిల్ ఇండియా డైరెక్టర్ నిషి మాథూర్ మాట్లాడుతూ.. 30 మంది విద్యార్థినులకు కాస్మోటాలజీ, మసాజ్, హెయిర్ స్టైలింగ్, స్కిన్ కేర్‌పై 30 రోజుల పాటు ఆఫ్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డి.సుచేత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం: కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహీనుద్దీన్ కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టనున్న పనులు, పెండింగ్ పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వరదనీరు మూసీలో కలిసేలా చేపట్టిన భారీ వరద నీటి పైపులైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, అలాగే అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేదని దీంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారని విన్నవించారు. దీంతో స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని ఎమ్మెల్యేకు హామీనిచ్చారు.

'భద్రాచలం ఆలయ ఈఓపై దాడి అమానుషం'

గన్‌ఫౌండ్రీ: భద్రాచలం సీతారామచంద్ర ఆలయ ఈఓ ఎల్.రమాదేవిపై దాడిని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. ఆలయ భూముల పరిశీలనకు ఏపీలోని పురుషోత్తపట్నానికి వెళ్లిన ఆమెపై దాడి చేయడం అమానుషమన్నారు. 2 రాష్ట్రాల సీఎంలు తక్షణమే స్పందించి వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిల్కూరి లక్ష్మీరామాచారి మాట్లాడుతూ.. మహిళా అధికార్లపై దాడి జరిగిందంటే అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయో కళ్లకు కట్టినట్లు అర్థమవుతుందన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు సత్య మనోరమ, ప్రతినిధులు దాసోజు పుష్పలత, కె.అనురాధా, యశోధ, మాధవి పాల్గొన్నారు.

తెలంగాణ వేమన సిద్ధప్ప వర కవి



సిద్ధప్ప వర కవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్.బాలాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ తొలి కవి, తెలంగాణ వేమనగా మహా కవి సిద్ధప్ప పేరుగాంచారని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, అఖిల భారతీయ కుమ్మర శాలీవాహన ప్రజాపతి కుంభకార్ మహా సంఘ్ రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో సిద్ధప్ప వర కవి రాజయోగి 122వ జయంతి వేడుకలను రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా నిజాం వ్యవస్థను తన కవితలతో నిరసించింపజేసిన వ్యక్తి అని సిద్ధప్ప కొనియాడారు. కార్యక్రమంలో కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్‌పర్సన్ డాక్టర్ రాధాకుసుమ, తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపకుడు బడేసాబ్, మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివానంద్ ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి సిలివేరు శంకర్ ప్రజాపతి, కవయిత్రి నాంపల్లి సుజాత, సిద్ధప్ప కుటుంబ సభ్యులు గంగాధర్, బాల్‌రాజ్‌లతో పాటు వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులైన సిబ్బందిని తొలగించాలి



యాకుత్‌పురా: బీఎల్‌ఓ విధుల నుంచి నిరక్షరాస్యులైన కామాటీ, కామాటన్‌లను తప్పించాలని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ బీఆర్ఎస్–కేవీ (టీజీహెచ్ఎంఈయూ) నాయకులు కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్ డీసీ సరితను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై డీసీ స్పందించి ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్, చార్మినార్ జోన్ అధ్యక్షుడు కె. విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ సునీల్ కుమార్ తదితరులు తెలిపారు.

సిటీ కాలేజీలో జాతీయ విద్యార్థి దినోత్సవం

చార్మినార్: ఏబీవీపీ 77వ స్థాపన దినోత్సవం, జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా నాయకులు సిటీ కళాశాలలో బుధవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు ప్రసంగించారు. కళాశాల అధ్యక్షుడు జితేందర్, చార్మినార్ నగర కార్యదర్శి రవితేజ, నాయకులు సంతోష్, శివ, కళాశాల కార్యదర్శి అక్షయ్, దుర్గాప్రసాద్, అనిల్, దేవేందర్, సాకేత్, సుందర్, శివమణి, నాగరాజ్, మనీశ్ పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణ కోసం సంస్థను ఏర్పాటు చేయాలి



సుల్తాన్‌బజార్: ఆలయా భూముల పరిరక్షణకు హైడ్రా తరహాలో మరో చట్ట బద్ధత సంస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ కార్యాలయం ఎదుట బుధవారం దేవాలయ భూములను పరిరక్షించాలని కోరుతూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ రవీంద్రచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ, అధ్యక్షుడు కందూరి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. చట్ట సవరణలు లేకుండా ఆలయ భూముల రక్షించుకోవడం అసాధ్యమని, జీహెచ్ఎంసీ లేదా హైడ్రా సంస్థల వలే దేవాదాయ శాఖకు చెందిన భూ ఆక్రమణలను తొలగించే చట్టబద్ధ సంస్థ ఎంతో అవసరమన్నారు. అలాగే ఈఓ రమాదేవిపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, చింతపట్ల బద్రినాథ్ చార్యులు, ప్రసాద్, బండారి జగపతి, సురేశ్, చక్రధరచార్యులు, కరణం మహేశ్ శర్మతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక నగరం



ఎస్.రాజు వస్తాద్‌తో సాయిబాబా చారి

మెహిదీపట్నం: హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ప్రముఖ సంఘ సేవకుడు, దేవీ ఉపాసకుడు ఎస్.రాజు వస్తాద్ అన్నారు. గోల్కొండ కోటలో అమ్మవారి వృత్తిపనులదారులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వృత్తిపని వారికి సరైన గుర్తింపు లభించేందుకు గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబా చారి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషి వల్లే వృత్తిపని వారికి బోనాల గౌరవ భత్యాన్ని దేవాదాయ శాఖ వారు ఇస్తున్నారని..వారికి గుర్తింపు కార్డులు సైతం ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన పాతనగరం ఉమ్మడి దేవాలయాల వృత్తిపనుల సంఘం ప్రతినిధులు, బి.సాయిబాబా చారి తదితరులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎ.అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

బోనాల నిర్వాహకులకు చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

మెహిదీపట్నం: బోనాల నిర్వహణకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్నామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ ఝామ్‌సింగ్ ఆలయ ప్రాంగణంలో దేవాలయాల నిర్వాహకులకు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ మునావర్, కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ హజిరీ, బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు ఉన్నారు.

అంధ విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు బ్యాగులు అందజేసిన ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అంధ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సహాయం అందిస్తున్నామని సగౌర చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రావు తెలిపారు. దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాల విద్యార్థులకు ఇంటర్నెట్ సేవలు, ఉచితంగా బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధ విద్యార్థులకు ఇంటర్నెట్ సేవలు, అయాకు గౌరవ వేతనం, కాలాడేరా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, కుర్చీల అందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వి. వెంకట్ రావు, ఎస్. నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ అధికారులు రాధాకృష్ణ, వరాంజేనేశ్వర్ రావు, దారుషిఫా అంధుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, నిర్మాల, ఆమరావతి, సమత, స్వాతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ ఎన్నికలను వెంటనే నిర్వహించాలి



చకిలం రమణయ్య

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రాథమిక సభ్యుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ గౌరవ అధ్యక్షుడు చకిలం రమణయ్య డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ..దివంగత మాజీ సీఎం కె.రోశయ్య ఆర్యవైశ్య మహా సభను స్థాపించి నిబంధనలు (బైలాస్) చట్టబద్ధంగా ఏర్పాటు చేశారన్నారు. అయితే అవి పాటించకుండా ఈ ఫిబ్రవరిలో ఇష్టారాజ్యంగా ఎన్నికలు నిర్వహించారన్నారు. కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులకు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ప్రతినిధులకు కూడా చట్ట ప్రకారం తెలంగాణ మహాసభ ఎన్నికల్లో పోటీచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ, రంగారెడ్డి జిల్లా డీఆర్‌లకు కూడా తాము తిరిగి ఎన్నికల నిర్వహనకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎల్లమ్మ తల్లికి ఒడిబియ్యం, పట్టువస్త్రాల సమర్పణ



మెహిదీపట్నం: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఉమ్మడి ఆలయాల వృత్తిదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెరోజి మహేశ్వర్ ఆధ్వర్యంలో ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, యాప కొమ్మలు, కల్లు సాకలను బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి అనుగ్రహం, కృప ఉంటే అన్ని విధాలా మేలు జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా తాము అమ్మవార్లకు పూజించి కల్లు సాక సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంఘం తరఫున ఆలయ నిర్వాహణాధికారి సి.వసంత, ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబును అమ్మవారి జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లురు జ్ఞానేశ్వర్, కోశాధికారి జి.సుదర్శన్, దేవేందర్, ప్రదీప్ కుమార్, కొల్లురు వెంకటేశ్, గోల్కొండ అమ్మవారి వృత్తిపనిదారుల వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి, గోల్కొండ శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

అఫ్జల్‌గంజ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇండిపెనెంట్ ఫెడరేషన్లు పిలుపునిచ్చిన ఒక్కరోజు సమ్మెను పురస్కరించుకుని హైదరాబాద్ ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం బీమా కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు డి.గిరిధర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. దేశంలో వలస పాలనను మించి ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు కార్మికుల పని గంటలను పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. కార్మికులందరూ ఏకమై మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోస్, శ్రీకాంత్ మిశ్రా, బీఎస్. రాంబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథ్, ఫణికుమార్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగాధర్, సతీశ్, హరీశ్‌బాబు, శివశంకర్, వేణుగోపాల్, సుజాత, తిరుపతయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అబిడ్స్ డాక్ సదన్ వద్ద..

అబిడ్స్: దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా అబిడ్స్ డాక్ సదన్ వద్ద కార్మికులు, ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఏపీ కేంద్ర ఉద్యోగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి అజీజ్ హాజరై మాట్లాడారు. 8వ వేతన సంఘాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్‌కుమార్, చారి, మహేందర్, శ్రీకాంత్, సోమేశ్, మధుసుదన్, మూర్తి, కవిత పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ

సంతోష్‌నగర్: నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన సమ్మెలో భాగంగా సీఐటీయూ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో సంతోష్‌నగర్ ప్రధాన రహదారిపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐ.ఎస్.సదన్ క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ ఓవైసీ ఎక్స్ రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అబ్బాస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్మిక కోడ్‌లను రహస్యంగా తీసుకువచ్చిందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకపోవడం, పైగా ప్రామాణిక 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం తగదని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రావణ్, మీనా, అబ్దుల్ లతీఫ్, బాలు నాయక్, మహ్మద్ జోహెబ్ అహ్మద్ పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

రైలు నుంచి దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నాంపల్లి: ఎంఎంటీఎస్ రైలు నుంచి దూకి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధురాలు హైటెక్ సిటీ–హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ల మధ్య నడుస్తున్న ఎంఎంటీఎస్ రైలు నుంచి దూకి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించి మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9848349544, 040–23202238 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

బోనాలకు రండి



మెహిదీపట్నం: కార్వాన్ దర్బార్ మైసమ్మ, ఉమ్మడి బోనాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ట్రస్టీ కమిటీ చైర్మన్ టి.అమర్ సింగ్ మంత్రి దామోదరం రాజనర్సింహాకు బుధవారంఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బోనాల నిర్వహణకు నిధులు కేటాయించడంతో పాటు ఆలయ కమిటీలకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం

గౌలిపురా: బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా సీబీటీ క్వార్టర్స్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి పవర్ బోర్ పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.